క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

మల్హర్: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీఓఎస్ఎస్) ద్వారా 2025–26 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీరామ్మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి చదవడానికి 2025 ఆగస్టు 31 నాటికి 14 సంవత్సరాలు ఇంటర్ చదవడానికి కనీసం 15 సంవత్సరాలు నిండాలని తెలిపారు. పదో తరగతికి జనన ధ్రువీకరణ పత్రం, కులం రెసిడెన్షియల్ పత్రాలు సమర్పించాలని తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్‌కు పదో తరగతి టీసీ, ఎస్ఎస్సీ మెమో సమర్పించాలన్నారు. పదో తరగతికి రూ.1150, ఇంటర్‌కు రూ. 1500 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తాడిచర్ల మండల పరిషత్ కార్యాలయం లేదా తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాలలోని స్కూల్ అసిస్టెంట్ వెంకట్‌ను సంప్రదించాలన్నారు.

నకిలీ సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలో మోసపూరితంగా నకిలీ సిగరెట్లు అమ్ముతున్న వ్యక్తులను గుర్తించి అరెస్టు చేసినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోల్డ్ ఫ్లేక్ కింగ్స్, లైట్స్ కింగ్స్ బ్రాండ్లకు చెందిన రూ.1.57లక్షల విలువైన నకిలీ సిగరెట్లు పట్టుకున్నట్లు చెప్పారు. నకిలీ సిగరెట్లు అమ్ముతున్న భూపాలపల్లి పట్టణానికి చెందిన కొమురవెల్లి దినేష్, గోదావరిఖనికి చెందిన వేణుప్రసాద్‌లను పట్టుకున్నట్లు తెలిపారు. నకిలీ సిగరెట్ల తయారీలో భాగమైన ఇతర వ్యక్తులను కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేగొండ: విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు (శనివారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు లైన్‌మెన్ విజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు రావులపల్లి, గడిపల్లి, పెద్దంపల్లి గ్రామాల్లో ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

రేగొండ: మండలంలోని నాగుర్లపల్లి గ్రామానికి చెందిన కుంట దేవేందర్ రెడ్డి ఇటీవల మృతి చెందాడు. దీంతో దేవేందర్ బాల్యమిత్రులతో పాటు, గ్రామస్తులు, బంధువులు, శ్రేయోభిలాషులు రూ.2.50 లక్షల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. వారి కుటుంబానికి ఏ సమస్య వచ్చిన అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, రాజు, ముఖేష్ రెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మొగుళ్లపల్లి: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని డాక్టర్ స్వప్న అన్నారు. మండలంలోని ఇస్సిపేట గ్రామంలో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 55 మందికి వైద్య పరీక్షలు చేసి ఇద్దరి రక్త నమూనా తీసి ల్యాబ్‌కు పంపినట్లు డాక్టర్ స్వప్న తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, హెల్త్ అసిస్టెంట్స్ భిక్షపతి, రజిత ఆశవర్కర్లు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రేషన్ డీలర్ మృతి

చిట్యాల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడటంతో గాయపడిన రేషన్ డీలర్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని చైన్‌పాక గ్రామానికి చెందిన రేషన్ డీలర్ దాసారపు రాజయ్య (70) గత నెల 29న అందుకుతండాకు సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లి ఇంటికి వస్తున్న క్రమంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో గాయపడిన రాజయ్యను కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యం కోసం చేర్పించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి కుమారుడు మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

అధికం అనర్థమే!



వరి పొలంలో ఎరువు చల్లుతున్న రైతు

- మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతున్న రైతులు
- పంట దిగుబడిపై ప్రభావం

రేగొండ: పంటల సాగులో రైతన్నలు అధిక దిగుబడి వస్తుందనే ఆశతో రసాయనిక ఎరువులను అధికంగా వినియోగిస్తుంటారు. అయితే ఏదైనా అధికంగా వినియోగిస్తే అనర్థమే అని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. వ్యవసాయంలో రోజురోజుకు రసాయనిక ఎరువుల వాడకం పెరిగిపోతుంది. దీంతో నేల భూసారం తగ్గడంతో పాటు పంటల దిగుబడులపై కూడా ప్రభావం చూపి దిగుబడులు పెరగడానికి బదులు తగ్గి ఆర్థికంగా నష్టాలు తప్పవని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ఏదైనా పరిమితంగా వాడితేనే ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు.

30 వేల ఎకరాల్లో పంటల సాగు

ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో రేగొండ మండల వ్యాప్తంగా 9,800 ఎకరాల్లో పత్తి, 7,550 ఎకరాల్లో వరి సాగు, కొత్తపల్లిగోరి మండల వ్యాప్తంగా 5,420 ఎకరాల్లో పత్తి, 5,670 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఏటా విత్తనం వేసిన నాటి నుంచి దిగుబడి వచ్చే వరకు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడుతున్నారు. తద్వార పంట పొలాల్లో భాస్వరం నిల్వలు పేరుకుపోతున్నాయి. సూక్ష్మపోషకాలు తగ్గిపోతున్నాయి. పొంచి ఉన్న ముప్పును నివారించేందుకు సేంద్రియ ఎరువులు వాడాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అవసరం మేరకే వాడాలి

మండలంలోని ఆయా గ్రామాల్లో గత సీజన్‌లో ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వాడడం ద్వారా పత్తి, వరి పంటల దిగుబడులు తగ్గాయి. పంటల సాగుకు అవసరం ఉన్న మేరకు ఎరువులు వాడాలని అధికారులు చెబుతున్నారు. వరి సాగులో పిలకలు వేసే సమయంలో ఎకరాకు డీఏపీ 50 కిలోలు, చిరు పొట్ట దశలో 25 కిలోల పొటాష్, పత్తి సాగులో డీఏపీ 50 కిలోలు, పూత, కాత సమయంలో 25 కిలోల యూరియా, కాయల సమయంలో 15 కిలోల పొటాష్ వినియోగిస్తే ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

నానో యూరియా వాడాలి



రైతులు పంటల సాగులో అధిక దిగుబడులు వస్తాయన్న ఆశతో మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో నేలలో భూసారం తగ్గి పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ప్రస్తుతం యూరియా కోసం గంటలు గంటలు లైన్లో నిలబడి తీసుకెళ్లడానికి బదులు నానో యూరియా వినియోగిస్తే పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

– పెద్ది వాసుదేవారెడ్డి, ఏఓ, రేగొండ

యూరియా కోసం రైతుల తిప్పలు



టేకుమట్ల: రైతులకు నచ్చచెబుతున్న పోలీసులు



గర్మిళ్లపల్లికి వెళ్తున్న లారీని అడ్డుకున్న రైతులు

మొగుళ్లపల్లి: రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. ఎక్కడ యూరియా ఇస్తే అక్కడికి వెళ్తున్నారు. శుక్రవారం మండలంలోని పర్లపల్లి రైతు వేదిక వద్ద యూరియా ఇస్తున్నారని తెలువడంతో ఉదయమే రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. నిలబడే ఓపిక లేక పోవడంతో చెప్పులను వరుసలో పెట్టారు.

టేకుమట్ల: మండల కేంద్రంలోని ఆగ్రోస్–1, మండలంలోని గర్మిళ్లపల్లి శ్రీనివాస ఫర్టిలైజర్‌కి రెండు వందల యూరియా బస్తాల చొప్పున లారీ లోడ్‌లు వచ్చాయి. 200 మంది రైతులకు సగం లోడు యూరియా బస్తాలను ఆగ్రోస్ నిర్వాహకులు పంపిణీ చేశారు. మిగతా 200బస్తాల లోడుతో ఉన్న లారీ గర్మిళ్లపల్లి బయల్దేరే సమయంలో మొత్తం లోడును ఇక్కడే ఇవ్వాలని రైతులు ఆందోళనకు దిగారు. సీఐ మల్లేశ్‌యాదవ్, ఎస్సై సుధాకర్‌లు ఆగ్రోస్ కేంద్రానికి చేరుకుని మరో 50 మంది రైతులకు యూరియా బస్తాలను అందించి ఆందోళన సద్దుమణిగేలా చేశారు.



మొగుళ్లపల్లి: యూరియా కోసం చెప్పులను క్యూలో ఉంచిన రైతులు

విద్యతో పాటు క్రీడలు అవసరం

- ఎంఈఓ కోడెపాక రఘుపతి



కబడ్డీ ఆడుతున్న ఎంఈఓ రఘుపతి

చిట్యాల: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరం అని ఎంఈఓ కోడెపాక రఘుపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరయ్యారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన అండర్ 14, అండర్ 17 విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలలో 450 మంది పాల్గొన్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జోనల్ స్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ సూదం సాంబమూర్తి, జిల్లా సెక్రటరీ లావుడ్య జైపాల్, డీవైఎస్ఓ జీర్రా రఘు, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, ఫిజికల్ డైరెక్టర్లు నూకల లింగయ్య, గాజర్ల శ్రీనివాస్, స్వరూపరాణి, ఉమా, వెన్నెల, శారద, అశోక్, భాస్కర్, నరేష్, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. వెళ్లేదెలా?



వెంకట్రావుపల్లి(సీ) వద్ద రోడ్డుపై గుంతలో నిలిచిన నీరు



జూకల్ గ్రామ శివారులో అధ్వానంగా ఉన్న రోడ్డు

చిట్యాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద, వెంకట్రావుపల్లి (సీ)తో పాటు మండలంలోని జూకల్ గ్రామ శివారులో తారు రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రమాదాలు జరిగితేనే పట్టించుకుంటారా అని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్లకు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గుంత

కొనసాగుతున్న మహిళ నిరసన



బాధితురాలికి మద్దతుగా కూర్చున్న మహిళలు

భూపాలపల్లి రూరల్: తనకు, తన బిడ్డకు న్యాయం చేయాలంటూ భర్త ఇంటి ఎదుట భార్య చేస్తున్న నిరసన శుక్రవారం రెండో రోజుకు కొనసాగింది. ఈ సందర్భంగా బాధితురాలు రమ్య మాట్లాడుతూ.. వివాహమై ఆరేళ్ల కుమార్తె ఉందని, కుమార్తె పుట్టిన నాటి నుంచి తన భర్త తనను వదిలించుకోవాలని చూస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. 9 ఏళ్లుగా గొడవలు జరుగుతూ.. అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేయగా తన తల్లీగారింటికి వెళ్లి కుమార్తెతో ఉంటున్నట్లు తెలిపింది. ఎన్నిసార్లు పంచాయితీలు జరిగినా మార్పు రావడం లేదని ఆవేదనవ్యక్తం చేసింది. తన భర్తతోనే ఉంటామని, లేదంటే చనిపోతామని వాపోయింది. రమ్య చేస్తున్న నిరసన కార్యక్రమానికి సుభాష్‌కాలనీ మహిళలతోపాటు పలు మహిళ సంఘాల నాయకులు మద్దతు పలికారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి



భూపాలపల్లి అర్బన్: ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సాయిలు



చిట్యాల: ఏచూరి చిత్రపటానికి పూలమాల వేస్తున్న రజనీకాంత్

భూపాలపల్లి అర్బన్: సీపీఎం కేంద్ర కమిటీ నాయకుడు సీతారాం ఏచూరి వర్ధంతిని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు పూలమాల వేసి పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, శేఖర్, భాస్కర్, భిక్షపతి, మహేందర్, జ్ఞానేశ్వర్, రాజేశ్వరి, రాధ పాల్గొన్నారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి

చిట్యాల: కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చింతల రజనీకాంత్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏచూరి వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ భూక్య నవీన్, కొముయ్య, సారయ్య, కల్పన, రాజ్‌కుమార్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలెం కాల్వను కొత్త చెరువుకు మళ్లించాలి

- కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి విక్రాంత్



పాలెం ప్రాజెక్టు కాల్వను పరిశీలిస్తున్న విక్రాంత్

వాజేడు : వెంకటాపురం(కె) మండలంలోని పాలెం ప్రాజెక్టు కాల్వను ఆరుగుంటపల్లి గ్రామం వద్ద ఉన్న కొత్త చెరువుకు మళ్లించాలని కాంగ్రెస్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ అన్నారు. శుక్రవారం సమీప రైతులతో కలిసి పాలెం వాగు ప్రాజెక్టు కాల్వను ఆరుగుంటపల్లి వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలెం కాల్వను ఇంకొంచెం పొడిగించి కొత్త చెరువుకు మళ్లించాలన్నారు. ఆలా చేస్తే మూడు గ్రామాల రైతులకు సంబధించిన 1000 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయించాల్సిందిగా కోరుతామని తెలిపారు. ఆయన వెంట రమేష్, గాంధీ, లక్ష్మణ్, నర్సయ్య, చందర్‌రావు, వేణు, శ్రీరాములు తదితరులున్నారు.

హైకోర్టు తీర్పును అమలు చేయాలి

ములుగు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్–1 పరీక్షలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని మల్లంపల్లి మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మొర్రి రాజుయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీజీపీఎస్సీ నిర్లక్ష్యం కారణంగా గ్రూప్–1 అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. పరీక్షల అవకతవకలపై సిట్టింగ్ జడ్జీతో విచారణ నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం నిరుద్యోగులపై తప్పుడు కేసులు నమోదు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. గ్రూప్–1 పరీక్షలను రద్దు చేస్తు నోటిఫికేషన్ విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీదర సంతోష్, సురేష్, రాజ్‌కుమార్, రాకేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా కళాశాల ప్రాంగణం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాగంణం చిరు వర్షాలకే నీరు నిల్వ ఉండి బురదమయంగా మారుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోగిల బాలు అన్నారు. శుక్రవారం కాలేజీని ఎస్ఎఫ్ఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల ప్రాంగణం మొత్తం నీరు నిల్వ ఉండి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ స్తంభంపై పిడుగు

ఏటూరునాగారం: మండలంలోని ఐటీఐ కళాశాల వెనుకాల కొమురం భీం నగర్‌లో శుక్రవారం రాత్రి విద్యుత్ స్తంభంపై పిడుగు పడింది. దీంతో విద్యుత్ లైట్లు, కరెంటు వైర్లు తెగిపడ్డాయి. స్తంభం పక్కనే పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో విద్యుత్ సరఫరా గంటపాటు నిలిచిపోయింది. సమీపంలోని ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ట్రాన్స్‌కో ఏఈ అశోక్, సిబ్బంది సత్వరమే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

జాకారం గురుకుల సమీపంలో..

ములుగు రూరల్: ములుగు మండలంలోని జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సమీపంలో నూతన పాలశీతలీకరణ కేంద్ర వద్ద పిడుగుపడింది. తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి సమయంలో ఎడతెరుపు లేకుండా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గురుకుల పాఠశాలకు , పాలశీతలీకరణ కేంద్రానికి మధ్యలో పిడుగుపడడంతో చెట్ల తోడుకలు మాడిపోయాయి. శీతలీకరణ కేంద్రంలో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. రాత్రి సమయం కావడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

జీపీఓల నియామకం



తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీపీఓలు

మొగుళ్లపల్లి: గ్రామ పాలనాధికారులు(జీపీఓ)లు శుక్రవారం విధుల్లో చేరారు. మండలంలో 10 క్లస్టర్స్ ఉండగా ఎనిమది మంది జీపీఓలు విధుల్లో చేరినట్టు తహసీల్దార్ సునీత తెలిపారు. మొగుళ్లపల్లిలో దాసరపు వసంత, ఇస్సిపేటలో నాలిక రవి, మొట్లపల్లిలో అలగొండ రాజు, అకినపల్లిలో కోరపాటి రవీందర్, రంగాపూర్‌లో మణెమ్మ, పిడిసిల్లలో మేదరి భద్రయ్య, పర్లపల్లిలో మేకల శైలజ, ముల్కలపల్లిలో నరేష్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తహసీల్దార్‌ను జీపీఓలు మర్యాదపూర్వకంగా కలిశారు.

మల్హర్: మండలంలోని ఏడు రెవెన్యూ క్లస్టర్ పరిధిలో ఏడుగురు జీపీఓ (గ్రామ రెవెన్యూ పాలన అధికారి) నియమిస్తు కలెక్టర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడిచర్ల 1 జీపీఓగా బొగం సాంబయ్య, తాడిచర్ల 2 చంద్యాల స్వర్ణలత, పెద్దతూండ్ల మెడిపల్లి రాజు, మల్లారం చకినాల రాజు, వల్లెకుంట మెడిపల్లి రాజేందర్, రుద్రారం రాసురి శ్రీనివాస్, నాచారం సాధు సంపత్‌లను నియమించారు. ఈ మేరకు తాడిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో వారు జీపీలుగా బాధ్యతలు స్వీకరించారు.

కోతుల బెడదను నివారించాలి



ములుగు రూరల్: వినతిపత్రం ఇస్తున్న నాయకులు



వెంకటాపురం(కె)లో..

ములుగు రూరల్: ములుగు మండలంలో, మున్సిపాలిటీ పరిధిలో కోతల బెడదను నివారించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు రత్నం ప్రవీణ్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో, మండలంలో కోతల బెడద తీవ్రంగా ఉందని అన్నారు. నాయకులు రవీందర్, రాజు, కోటయ్య, సద్దాంహుస్సైన్ సాంబయ్య తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో కోతల సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో కోతుల బెడద మూడు సంవత్సరాల నుంచి ఉందని అన్నారు. కోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మండల కేంద్రంలోని కోతులను పట్టుకోని సమీప అటవీ ప్రాంతంలో వదిలి పెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండలంలోని కొరికిశాల మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఇంటర్ విద్యార్థులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ప్రిన్సిపాల్ రాకేశ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.